వరి... చేతికొచ్చే సిరి

- ఆశాజనకంగా పంట దిగుబడి
- ఎకరాకు 50 నుంచి 55 బస్తాలు
- ప్రభుత్వం చొరవతో పుష్కలంగా నీరు



గాడలంకలో కోత కోసిన ధాన్యం ఆరబోత

ముమ్మిడివరం: పచ్చని సిరి చేతికొచ్చింది.. పుడమి పుత్రుల పంట పండింది.. ఈ ఏడాది అన్నీ అనుకూలించడంతో దిగుబడిపై ఆశలు రేకెత్తిస్తోంది.. ప్రస్తుతం రబీ పంట కోతకు వచ్చింది.. రబీలో వంతుల వారీ విధానం, లిఫ్ట్ ఇరిగేషన్ పనులతో సాగునీటి సమస్య తీరింది. ప్రభుత్వం అధికారులను సమన్వయ పరిచి చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇచ్చింది. ముమ్మిడివరం నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో సాగునీటి కొరత లేకుండా సాగు సాఫీగా సాగింది. ముమ్మిడివరం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 21,013 ఎకరాలలో రబీ సాగు చేయగా ఇందులో 12,700 ఎకరాలు ఎంటీయూ 1121 రకం, 8,323 ఎకరాల్లో ఎంటీయూ 3,626 వరి రకం సాగు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి తెలిపారు. సాగు ప్రారంభంలో నీటి లభ్యత తక్కువగా ఉందన్న అధికారుల ప్రకటనతో రైతులు కాస్త ఆందోళన చెందారు. అయితే ప్రభుత్వం చొరవ తీసుకుని నీటి ఇబ్బందిని ప్రణాళిక ప్రకారం తీర్చడంతో అందరి అంచనాలు తలకిందులు చేస్తూ సాగునీటి సమస్య ఏమాత్రం లేకుండా రైతులు గట్టెక్కారు.

సమన్వయం చేసుకుంటూ..

శివారు గ్రామాల్లో కొన్ని ఆయకట్టు భూములకు నీటి సమస్య ఎదురైనా ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో సమస్యను అధిగమించారు. ముమ్మిడివరం మండలం అయినాపురం, సోమిదేవర పాలెం, కొత్తలంక, సీహెచ్ గున్నేపల్లి, ఐ.పోలవరం మండలం గుత్తెనదీవి, జి.వేమవరం, టి.కొత్తపల్లి, తిళ్ల కుప్ప, కాట్రేనికోన మండలం పల్లంకుర్రు, కందికుప్ప, నడవపల్లి, కొప్పిగుంట తదితర గ్రామాల్లో సాగునీరు అందక రైతులు కొంత ఇబ్బంది పడ్డారు. ఆయా ప్రాంతాల్లో అవస్థలను గుర్తించి మురుగునీటి కాలువలకు క్రాస్ బండ్‌లు ఏర్పాటు చేసి ఆయిల్ ఇంజిన్ల ద్వారా నీరందించారు.

ఎప్పటికప్పుడు అప్రమత్తం

సాగునీటి సమస్యపై రైతులు ఫిర్యాదులు చేయగా సంబంధిత అధికారులను ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ అప్రమత్తం చేశారు. జిల్లాలో ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ, డ్రైనేజీ శాఖల అధికారులతో దాళ్వా ఆరంభమైన నాటి నుంచి తరచూ సాగునీటి పరిస్థితులపై సమీక్షించారు. మురుగు కాలువల్లో నీటిని సాగుకు ఉపయోగించేందుకు కాలువలకు క్రాస్ బండ్‌లు ఏర్పాటు చేసి ఆయిల్ ఇంజిన్లు పైపులు సిద్ధం చేయించారు. కాలువల్లోని వృథా నీటిని ఇంజిన్ల ద్వారా పొలాలకు మళ్లించారు. దీనికితోడు వంతుల వారీ విధానంతో సాగునీరు సరిపడా అందడంతో అటు రైతులు, ఇటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సాగునీటితో పాటు వాతావరణం అనుకూలించడంతో ప్రస్తుతం సిరుల పంట పడింది. ఎకరాకు 50 నుంచి 55 బస్తాల వరకూ దిగుబడి వస్తుంది. రైతులు మాసూలు చేసిన ధాన్యాన్ని రోడ్లు, పుంత గట్లు, ఖాళీ స్థలాల్లోను ఎండ బెడుతున్నారు.



గాడిలంకలో యంత్రాలతో వరికోత పనులు

కొరత రాకుండా చర్యలు



ఈ ఏడాది రబీ పంట ఆశాజనకంగా ఉంది. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సాగు చేశా. ఎటువంటి చీడపీడలు లేవు. మొదట్లో కొంత నీటి ఎద్దడిని ఎదుర్కొన్నాం. అధికారులు అప్రమత్తమై నీటి కొరత లేకుండా చర్యలు తీసుకున్నారు. ఎకరాకు 50 బస్తాల పైబడి దిగుబడి వస్తోందని అంచనా వేస్తున్నాం. ఇప్పుడిప్పుడే కోతలు కోస్తున్నాం.

– బస్వా సత్యనారాయణమూర్తి, రైతు, గాడిలంక

ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సత్ఫలితాలు



రబీలో సాగునీటి కొరత వస్తుందన్న హెచ్చరికలతో కొన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ముందస్తు చర్యలు తీసుకున్నాం. మురుగు నీటి కాలువల్లో నీరు వృథాగా పోకుండా క్రాస్ బండ్లు ఏర్పాటు చేయించాం. ఆయిల్ ఇంజిన్ల ద్వారా నీటిని పంట పొలాల్లోకి మళ్లించాం. వంతుల వారీగా నీటిని సరఫరా చేస్తూ సమస్యను అధిగమించాం.

– పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎమ్మెల్యే, ముమ్మిడివరం

క్లుప్తంగా

అవగాహనతో అగ్ని ప్రమాదాల నివారణ



ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక దళాధికారి కొండబాబు

అమలాపురం టౌన్: అవగాహనతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని అమలాపురం అగ్నిమాపక దళాధికారి కేవీ మురళీ కొండబాబు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానికంగా పలు ఆసుపత్రుల్లో అగ్నిమాపక సిబ్బంది బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆసుపత్రుల్లో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్నిమాపక దళాధికారి కొండబాబు తెలిపారు. అగ్నిమాపక పరికరాలు, యంత్రాలను ప్రయోగాత్మకంగా ప్రదర్శించి అవగాహన కల్పించారు. అనంతరం నివారణ చర్యలపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నిమాపక దళం లీడింగ్ ఫైర్‌మెన్ ఎం.బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కుడుపూడి



కుడుపూడి శివన్నారాయణ

తాళ్లరేవు: ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన పి.మల్లవరం గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుడుపూడి శివన్నారాయణ ఈ నెల 23న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు బుధవారం పి.మల్లవరం పంచాయతీ పత్తిగొందిలో ఆయన స్వగృహంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. శివన్నారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ ఆశీస్సులతో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తనను ఎంపిక చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 23న ఉదయం 11 గంటలకు ముమ్మిడివరం మహిపాల చెరువు వద్ద గ్రాండ్ పార్క్ కల్యాణ మండపంలో ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు.

చలివేంద్రం ప్రారంభం



తాళ్లరేవులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సుహాసినీదేవి తదితరులు

తాళ్లరేవు: ప్రజల దాహార్తి తీర్చేందుకు తాళ్లరేవు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి ప్రారంభించారు. దీనిని స్థానిక సంతపేట సెంటర్‌లో సామాజిక ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి శంకరనారాయణ, సచివాలయ కార్యదర్శి టేకుమూడి వేణుగోపాల్, కేశవస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ కొల్లు శ్రీనివాసరావు, నాయకులు రెడ్డి రెడ్డిబాబు, ఆకుల వెంకన్న పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

తాళ్లరేవు: స్థానిక సామాజిక ఆసుపత్రికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన సుమారు 100 మంది గర్భిణులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని అందించారు. బుధవారం దివంగత చిట్టూరి కృష్ణ లయన్స్ ఆర్య జనని ట్రస్ట్ ద్వారా కుటుంబ సభ్యులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఈ భోజనాన్ని అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, ప్రతినిధులు వేలూరి సూరిబాబు, సామా భగవాన్, పొన్నాడ పేరయ్యరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సావిత్రినగర్‌లో వైద్య శిబిరం

యానాం: నియోజకవర్గ శివారు గ్రామమైన సావిత్రినగర్‌లో యానాం ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఫైలేరియా వ్యాధి నివారణకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు జీజీహెచ్ డీడీ రవిశంకర్ తెలిపారు. గ్రామంలోని మహిళలు, చిన్నారులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. హెల్త్ ఇన్‌స్పెక్టర్ రమేష్, ల్యాబ్ అసిస్టెంట్ శేరు కృష్ణ పాల్గొన్నారు.

108 సేవలపై అవగాహన



సీపీఆర్ చేసే విధానాన్ని చూపుతున్న 108 సిబ్బంది

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ అజమ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు 108 అంబులెన్స్ సేవలపై అవగాహన కల్పించారు. ఎవరైనా గుండె పోటుతో స్పృహ తప్పి పడిపోతే అత్యవసర చికిత్సగా సీపీఆర్ చేసే విధానాన్ని సిబ్బంది ప్రయోగాత్మకంగా చూపించారు. ప్రమాదాలు జరిగినప్పుడు 108 వాహనాన్ని ఏ విధంగా సంప్రదించాలో వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లంకా రాణి, సైన్స్ ఉపాధ్యాయులు వై.సత్యనారాయణ, ఎ.శ్రీనివాస్, సిబ్బంది జి.ప్రవీన్, వి.మణిదీప్ పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం



రెడ్డిపల్లిలో పథకాల లబ్ధి పత్రాలను అందజేస్తున్న మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం రూరల్: రాష్ట్రంలో రహదారుల ప్రగతికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. రెడ్డిపల్లి- ఉప్పలగుప్తం మండలం సింగరాయపాలెం నుంచి విలసవిల్లి మీదుగా 2.4 కిలోమీటర్ల బీటీ, సీసీ రోడ్డును ఏఐబీ నిధులు రూ. 183 కోట్లతో నిర్మిస్తున్నారన్నారు. బుధవారం రెడ్డిపల్లిలో గ్రామ సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అధికారులు, పార్టీ నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో రెడ్డిపల్లి నుంచి ఉప్పలగుప్తం మండలం సింగరాయపాలెం భీమనపల్లి అశోక్‌నగర్ మీదుగా కామనగరువు వెళ్లాలంటే జనం ఇబ్బందులు పడేవారన్నారు. మంత్రి విశ్వరూప్ కృషితో ఈ రోడ్డును ఆధునీకరిస్తున్నట్లు వివరించారు. ప్రజల అవసరాల దృష్ట్యా ప్రధాన రోడ్డులో కొంత సీసీ, బీటీ రోడ్డుగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాల గురించి ఆయన వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు పందిరి హరిరామ్‌గోపాల్, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడిపూడి వెంకటేశ్వరబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, కర్రేళ్ల రమేష్‌బాబు, సర్పంచులు రేలంగి దుర్గారావు, నక్కా అరుణ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి విశ్వరూప్‌ను కలసిన ఎస్పీ



మంత్రి విశ్వరూప్‌కు మొక్కను అందిస్తున్న ఎస్పీ

అమలాపురం టౌన్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా ఎస్పీ సుసారపు శ్రీధర్ బుధవారం రాత్రి స్థానిక కాటన్ అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి, ఎస్పీ జిల్లా శాంతి భద్రతలపై కొద్దిసేపు చర్చించుకున్నారు.

అల్లవరం: ప్రజా సేవలో మహిళా పోలీసులు కీలకపాత్ర పోషించాలని జిల్లా ఎస్పీ శ్రీధర్ అన్నారు. బుధవారం అమలాపురంలో ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్‌ను మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ ఏ రాష్ట్రంలోని లేని విధంగా ప్రతి గ్రామానికి మహిళా పోలీసు ప్రతినిధిని నియమించిన ఘనత మన రాష్ట్రానికి దక్కుతుందన్నారు. అనంతరం అడిషినల్ ఎస్పీ లతామాధురిని వారు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షురాలు కొప్పిశెట్టి వెంకట ధనలక్ష్మి, సంయుక్త కార్యదర్శి పీఎస్ ప్రియరంజని, టి.రాజేశ్వరి, కేవీఎస్ఎన్ గనికమ్మ, పి.చంద్ర, శ్రీలత, ధనలక్ష్మి, రేణుకాదుర్గ, సోమ చంద్రిక, జెస్సీ జాస్మిన్ పాల్గొన్నారు.

దిగుబడినిచ్చే విత్తనాలు వేసుకోవాలి



భీమనపల్లిలో భీమ్ 115 రకం వరి పంటను పరిశీలిస్తున్న ఏడీ షంషీ, ఏఓ కుమార్‌బాబు

ఉప్పలగుప్తం: వరి సాగులో అధిక దిగుబడినిచ్చే విత్తనాలను మార్కెటింగ్ విధానాన్ని గమనించుకుని కొంత భాగంలో ప్రయోగాత్మకంగా వేయాలని అమలాపురం వ్యవసాయ శాఖ ఏడీ ఎంఏ షంషీ అన్నారు. భీమనపల్లిలో రాయపూర్‌కు చెందిన వీఎన్‌ఆర్ సీడ్స్ సంస్థ ప్రతినిధులు తాము రూపొందించిన హైబ్రీడ్ వరి విత్తనం భీమ్ 115పై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా ఏడీ షంషీ, ఏఓ జి.కుమార్‌బాబు హాజరయ్యారు. వీఎన్‌ఆర్ సంస్థ ఆర్‌బీఎమ్ కె.అరవింద్ మాట్లాడుతూ భీమ్ 115 వరి విత్తనం రబీలో వచ్చే తెగుళ్లను సమర్థవంతంగా తట్టుకుని, మిగతా విత్తనంతో పోలిస్తే అధిక దిగుబడి ఇస్తుందన్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ గతంలో ప్రయోగాత్మకంగా విత్తనాన్ని వేశామని, దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. సంస్థ ప్రతినిధులు ఎండీ అహ్మద్, డి.ప్రశాంత్, యెండూరి నాగేశ్వరరావు, మానే శ్రీనువాసరావు, రైతులు ఆకేటి సత్యవిష్ణు, యాళ్ల చిన్నా పాల్గొన్నారు.

సేవలు ప్రశంసనీయం



దివంగత వెంకట సూర్యనారాయణ విగ్రహ ఆవిష్కరణలో ప్రముఖులు

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో కాపుల అభ్యున్నతికి, కాపు కల్యాణ మండపం నిర్మాణానికి ప్రముఖ వ్యాపారవేత్త, దివంగత గాజుల వెంకట సూర్యనారాయణ అందించి సేవలు ఎనలేనివని పలువురు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పెద్దిరెడ్డి వినాయకరావు కాపు కల్యాణ మండపం ఆవరణలో గాజుల వెంకటసూర్యనారాయణ విగ్రహాన్ని రిటైర్డ్ ఇంజినీర్, ఆర్ఐటీ మాజీ డీన్ అన్యం రామకృష్ణారావు ఆవిష్కరించారు. గాజుల శ్రీబ్రహ్మానందం (బాబి), కాపు సంఘ అధ్యక్షుడు కాటంశెట్టి రామ్మూర్తి, వీరబాబు, కోన సుబ్బారావు, రిటైర్డ్ ఆర్ఏఓ దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, తిరుమల నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చాటిన కిమ్స్ మెడికోలు

క్రీడా పోటీల్లో ప్రతిభ

అమలాపురం రూరల్: విజయవాడ డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకూ నెల్లూరులోని నారాయణ మెడికల్ కాలేజీ ప్రాంగణంలో నిర్వహించిన 2022–23 ఇంటర్ కాలేజీ పురుషుల క్రీడా పోటీల్లో కిమ్స్ మెడికల్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఫుట్‌బాల్ పోటీల్లో తృతీయ స్థానం సాధించారు. విద్యతో పాటు క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ రాజు (చైతన్యరాజు), ఎండీ రవి కిరణ్ వర్మ, కిమ్స్ కళాశాల డీన్ డాక్టర్ ఆనంద్ ఆచార్య, జనరల్ మేనేజర్ రమేష్ అభినందించారు.

నిత్యావసరాల వితరణ



కామాక్షీ పీఠానికి సరకులు అందిస్తున్న కేతా భానుతేజ

అమలాపురం రూరల్: స్థానిక కామాక్షీ పీఠంలో అనాథలకు నాలుగు బియ్యం బస్తాలు, 10 కిలోల కందిపప్పును బండారులంకకు చెందిన మండల వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కేతా భానుతేజ దంపతులు అందించారు. స్థానిక లూయి అంధుల పాఠశాల విద్యార్థులకు ఉదయం టిఫిన్, భోజనం ఏర్పాటు చేశారు. అంధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, పట్టణ అధ్యక్షుడు సంసాని నాని, బాలాజీలు భానుతేజను అభినందించారు.

బాధిత కుటుంబానికి సాయం



రోగి కుటుంబీకులకు సాయం అందిస్తున్న జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: రావులపాలేనికి చెందిన కర్రి విజయకుమార్ అనారోగ్య పరిస్థితి దృష్ట్యా ఆ పేద కుటుంబానికి విశ్వ బ్రాహ్మణ యువత రూ.20 వేల సాయం అందించింది. స్థానిక విశ్వ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో బుధవారం జరిగిన కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ యువత ప్రతినిధులు కోసూరి చిదంబరాచారి, బొల్లోజు శ్రీకాంత్ ఆధ్వర్యంలో జిల్లా సంఘం పెద్దలు కట్టోజు సన్నయ్యదాసు, తాళాబత్తుల అప్పలాచారి ఈ మొత్తాన్ని రోగి కుటుంబీకులకు అందజేశారు. జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి ఆవుపాటి వేణుగోపాలకృష్ణ, ప్రతినిధులు కట్టోజు వెంకట సుబ్బారావు, చేబ్రోలు గంగా నాగేశ్వరరావు, పట్నాల వెంకటరమణ పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు పెట్టొద్దు



సమీక్షలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్

అల్లవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల్లో ఫ్లెక్సీల నిర్వహణ, శాంతి భద్రతలపై ఎంపీడీఓ జి.సరోవర్ అధ్యక్షతన బుధవారం రెవెన్యూ, పంచాయతీ రాజ్, మహిళా పోలీసులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. ఈఓపీఆర్‌డీ ఎన్‌వీవీ సత్యనారాయణ, కార్యదర్శులు కేవీవీ సత్యనారాయణ, రాజా, దుర్గా శ్రీనివాస్, గుత్తుల వాసు, రాజమోహన్ పాల్గొన్నారు.

లారీల ఆశీలు రద్దు చేయాలి

అమలాపురం టౌన్: పట్టణంలో వసూలు చేసిన లారీల ఆశీలను రద్దు చేయాలని ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ తన తొలి సమావేశంలో తీర్మానించింది. స్థానిక మొబర్లీపేటలో చాంబర్ అధ్యక్షుడు బోణం సత్తిబాబు అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. లారీల ఆశీల సమస్యలపై చాంబర్ తరఫున న్యాయ పోరాటం చేయాలని సమావేశం నిర్ణయం తీసుకుంది. చాంబర్ గౌరవాధ్యక్షుడిగా అల్లాడ స్వామినాయుడును కార్యవర్గ ప్రతినిధులు ఆహ్వానించారు. అనంతరం చాంబర్ మీడియా కన్వీనర్‌గా దూరి రాజేష్, గ్రీటింగ్స్ కమిటీ ప్రతినిధిగా నంబూరి నరేష్‌లను నియమించారు. వీరిని చాంబర్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోకరకొండ హరిబాబు అభినందించారు. ప్రతినిధులు కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, మేడిచర్ల త్రిమూర్తులు, చింతలపూడి సత్తిబాబు, రేకపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల ధ్వంసం కేసులో ముగ్గురి అరెస్టు

ముమ్మిడివరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీల ధ్వంసం కేసులో ముగ్గురిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై కె.సురేష్‌బాబు వివరించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనిపై అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు చీకురుమిల్లి సాయిప్రకాష్, గంటి రమేష్, మట్టా శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా స్థానిక పెట్టావారిపేట పెద్ద వంతెన వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గేదెల్లంకకు చెందిన దొంగ నాగకృష్ణ, ఠానేల్లంకకు చెందిన బొక్కా మనోహర్, ముమ్మిడివరం పెద్ద వంతెనకు చెందిన ఒక బాలుడు ధ్వంసం చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో ముగ్గురిని అరెస్టు చేసి యువకులను ముమ్మిడివరం కోర్టులోను, బాలుడిని రాజమండ్రి జువైనల్ కోర్టులోను హాజరు పరచినట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

వెంకన్న ఆలయానికి విరాళం



ఆలయ చైర్‌పర్సన్ వీరీతాదేవికి విరాళాన్ని అందజేస్తున్న దాతలు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయానికి పట్టణానికి చెందిన శ్రీకామాక్షీ హాల్మార్కింగ్ యజమాని వీర్ని మోహనవెంకట సత్యసాయి, లలిత శివసాయి దంపతులు రూ.10,116 విరాళంగా బుధవారం సమర్పించారు. ఈ చెక్కును ఆలయంలో చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవికి దాతలు అందించారు. స్వామివారి కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించడమే కాకుండా ఆలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్న వీరీతాదేవి దంపతులను దాతలు అభినందించారు. వైఎస్సార్ సీపీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు

అల్లవరం: గ్రామ గ్రామాన నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. అల్లవరంలో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఎమ్మెల్సీ సర్వే చేశారు. యజమానుల అనుమతితో ఇంటి తలుపులకు జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లను అతికించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, నాయకులు పాల్గొన్నారు. దేవగుప్తంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలపై ప్రజా సర్వే చేశారు. సర్పంచ్ సాధనాల వెంకటరావు, పినమాల విక్రమ్ పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేయొద్దు

యానాం: వేసవి అవసరాల దృష్ట్యా తాగునీటిని వృథా చేయకుండా అవసరమైన మేరకు వినియోగించుకోవాలని ఆర్ఏఓ మునిస్వామి యానాం నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం గోదావరిలో నీటి లభ్యత తక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో 55 ఎకరాల్లోని చెరువుల్లో నీటిమట్టం తగ్గుతుందన్నారు. ఇప్పటికే తాను కాకినాడ జిల్లా కలెక్టర్‌ను కలసి నీటి ఎద్దడి సమస్య గురించి వివరించానని తెలిపారు. దీనికి కలెక్టర్ స్పందించి ప్రత్యేక వంతు నీటిని యానాంకు పంపిణీ చేయడానికి హామీ ఇచ్చారన్నారు. అదేవిధంగా ధవళేశ్వరం హెచ్‌వర్క్స్ సూపరింటెండెంట్ ఇంజినీర్ సైతం నీటి పంపిణీలో సహకరిస్తున్నారన్నారు. పిల్లంక ఫ్రెంచ్ చానల్ వద్ద క్రాస్‌బండ్ వేసి అక్కడి నుంచి పంపుల ద్వారా నీరు తోడేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

నెలాఖరు వరకూ నీటిని అందించాలి

తాళ్లరేవు: తాళ్లరేవులో తాగు, సాగునీటి అవసరాల నిమిత్తం ఈ నెలాఖరు వరకూ కాలువలకు నీటిని సరఫరా చేయాలని అధికారులను కోరినట్లు జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్ తెలిపారు. బుధవారం కాకినాడలో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడానన్నారు. మండలంలోని సుమారు 10 మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలంటే ఈ నెలాఖరు వరకూ నీటిని అందించాలన్నారు. తాళ్లరేవులోని 30 పడకల ఆస్పత్రిలో డయాలసిస్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

న్యాయవాదుల నిరసన

ముమ్మిడివరం: హైకోర్టు సీనియర్ న్యాయవాదులు సుంకర రాంజీ ప్రసాద్, జడా శ్రావణ్‌కుమార్, గొట్టిపాటి వెంకట రామకృష్ణప్రసాద్‌లు విజయవాడ ప్రొబేషనల్ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైనందుకు సీఐడీ పోలీసులు కేసు నమోదు చేయడంపై ముమ్మిడివరంలో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ముమ్మిడివరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం విధులను బహిష్కరించారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఉప్పలగుప్తం: చల్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు, 11 కేవీ తీగలను ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం గురువారం విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ రవికుమార్ తెలిపారు. చల్లపల్లి, వాసాలతిప్ప, నక్కా రామేశ్వరం, గోపవరం, సరిపల్లి గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

యానాం: రంజాన్ మాసం నేపథ్యంలో ముస్లింలకు బుధవారం ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సూదా భూషణం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక చారిత్రక పెద్ద మసీదులో జరిగిన ప్రార్థనల్లో అధ్యక్షుడు మల్లాడి సామ్యూల్, విశ్రాంత సీఐ గూటం శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.